కాళేశ్వరంపై కొర్రీ.. మత్స్యసంపద ఆవిరి

4 నెలల కాంగ్రెస్ పాలనలో మత్స్యపరిశ్రమ ఆగమాగం

అడుగంటిన ప్రాజెక్టులు.. ఎండుతున్న చెరువులు, కుంటలు

నీళ్లు లేక.. ఎండను తట్టుకోలేక టన్నుల కొద్ది చేపల మృత్యువాత

గోదావరి పొడవునా 50 వేలకుపైగా మత్స్యకార్మికులపై ప్రభావం

కేసీఆర్ పాలనలో రోజుకు రూ.2 వేల వరకు సంపాదన

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం టేకుర్తిలోని ముప్పారపు చెరువులో ఇటీవల చనిపోయి తేలిన చేపలు (ఇటీవల ఆరు టన్నులు చేపలు ఇలా చనిపోయాయి)

కరీంనగర్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నాలుగు నెలల కిందట కాళేశ్వర జలాలతో కళకళలాడిన ప్రాజెక్టులు.. ప్రస్తుతం వెలవెల బోతున్నాయి. నిరుటి వరకు మండుటెండల్లో మత్తడి దూకిన చెరువులు ఇప్పుడు నెర్రెలుబారి దర్శనమిస్తున్నాయి. మేడిగడ్డ బరాజ్ విషయంలో కాంగ్రెస్ సర్కారు కక్షపూరిత వైఖరి వల్ల కాళేశ్వరం ఎత్తిపోతల పథకం-గోదావరినది-దాని అనుసంధాన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయి. వాటి కింద సాగయ్యే వ్యవసాయంతో పాటు.. ఆ జలాలనే నమ్ముకొని కొనసాగుతున్న మత్స్యపరిశ్రమ కూడా ఆగమవుతున్నది. ప్రాజెక్టులు ఖాళీ కావడంతో చెరువుల్లో కావాల్సినంత నీరు లేక.. ఎండ ధాటికి తట్టుకోలేక టన్నుల కొద్ది చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా వేలాది కుటుంబాలకు చేరాల్సిన మత్స్యసంపద ఆవిరవుతున్నది. యావత్ మత్స్యపరిశ్రమ ఉనికికే ప్రమాదం వచ్చిపడింది. సుమారు 50 వేల కుటుంబాల జీవన విధానంపై ప్రభావం పడిందని మత్స్యకార్మిక లోకం ఆవేదన చెందుతున్నది. కేసీఆర్ పాలనలో రోజుకు రూ.2 వేల సంపాదన పొందిన మత్స్యకారులు.. ప్రస్తుతం ఉపాధి లేక దిక్కుతోచని స్థితిలో జీవిస్తున్నట్టు వాపోతున్నది.

మత్స్యపరిశ్రమకు కేసీఆర్ జీవం

ఒకప్పుడు తెలంగాణ మత్స్య పరిశ్రమకు కేరాఫ్‌గానే నిలిచినా.. ఉమ్మడి రాష్ట్రంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల విషయంలో జరిగిన వివక్షతో మత్స్యసంపద దాదాపుగా తగ్గిపోయింది. అప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అలా అయితేనే చేపలు దొరికేవి. కానీ.. స్వరాష్ట్రంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభమైన తర్వాతి నుంచి నిన్న, మొన్నటి వరకు మత్స్య సంపదకు తెలంగాణ కేరాఫ్‌గా ఉన్న విషయం తెలిసిందే. సాగునీటి రంగ దశదిశను మార్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. అంతే శ్రద్ధతో మత్స్య పరిశ్రమకు జీవం పోసిన విషయం తెలిసిందే. ఈ వృత్తిపై ఆధారపడిన వేలాది మంది జీవితాల్లో వెలుగులు నిండాయి. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన తర్వాత మేడిగడ్డ నుంచి మొదలుకొని.. అన్నారం-సుందిళ్ల-ఎల్లంపల్లి, నంది రిజర్వాయర్ వరకు, అలాగే శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు), దిగువమానేరు జలాశయం, అన్నపూర్ణ, ఎగువమానేరు జలాశయాలతోపాటు ఈ పరిధిలోని ప్రతి చెరువు నిత్యం నిండుకుండను తలపించాయి. ఫలితంగా.. మత్స్య కార్మికులకు ఉపాధి దొరికింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. గ్రామాలు, పట్టణాల్లో చేపల జాతర కనిపించేది.

వేలాది మందికి జీవనోపాధి

మేడిగడ్డ బరాజ్ నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ వరకు చూస్తే రాజన్న సిరిసిల్ల జిల్లా, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాలకు చెందిన మత్స్యకార్మికులు చేపలు పట్టుకొని విక్రయించేవారు. ఈ ఐదు జిల్లాల్లో 735కుపైగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా.. వీటి పరిధిలో 53,389 మంది సభ్యులున్నారు. ప్రతి సంఘంలోని సభ్యుడికి ఈ మత్స్య సంపదతో సంబంధం ఉంది. అంతేకాదు.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, నంది రిజర్వాయర్, శ్రీ రాజరాజేశ్వర జలాశయం, దిగువమానేరు, అన్నపూర్ణ, ఎగువ మానేరు పరిధిలో 5,956 మంది చేపలు పట్టుకోవడానికి అధికారికంగా లైసెన్స్‌లు జారీ చేశారు. లైసెన్స్‌లు లేని వేలాది మంది కార్మికులు కూడా ఈ వృత్తి ఆధారంగా జీవించేవారు. సంఘాల సభ్యులు, లైసెన్స్‌లు కలిగి ఉన్న మత్స్యకారులే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 15 వేల నుంచి 20 వేల మందికిపైగా జీవనోపాధి పొందేవారు.

మత్స్య కార్మికుల ఉపాధికి ముప్పు

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ ప్రభుత్వం కొన్ని వందల కోట్ల విలువ చేసే మత్స్య సంపదను సృష్టించింది. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో చేపలు పట్టుకోవడంతోపాటు విక్రయించుకునేందుకు సంపూర్ణ హక్కులను కల్పించింది. కేసీఆర్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహంతో ప్రతి కార్మికుడు దాదాపు రోజుకు రూ.2 వేల వరకు సంపాదించుకునేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి లేకపోగా.. దిన దిన గండంగా మారడమేకాదు, మత్స్య సంపద మాయమైపోయే దుస్థితి వచ్చింది. మేడిగడ్డ బరాజ్ కుంగిందన్న ఒకే ఒక సాకు చూపి.. కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయడం లేదు. బరాజ్ కుంగినా అక్కడే కాపర్ డ్యాం కట్టి.. పంపుల ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చని సాగునీటి, ఇంజినీరింగ్ రంగ నిపుణులు చెప్తున్నా.. ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ఫలితంగా ఇప్పటికే దాదాపు అన్ని ప్రాజెక్టుల్లో నీరు తగ్గిపోయి డెడ్ స్టోరీజీకి చేరుకొని మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టుల పరిధిలో మత్స్యకార్మికులు ఉపాధి కోల్పోయారు. ఆ పైన ఉన్న సుందిళ్ల, ఎల్లంపల్లి, నంది రిజర్వాయర్ బరాజ్‌లలో నీరు తగ్గిపోవడంతో మత్స్య సంపద అంతంత మాత్రంగానే ఉన్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయం, దిగువమానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కేసీఆర్ సర్కారు హయాంలో.. శ్రీరాజరాజేశ్వర జలాశయాన్ని వాటర్ హబ్‌గా మార్చారు. ఇక్కడ ఆక్వాహబ్ ఏర్పాటు చేసేందుకు ప్రఖ్యాత ప్రపంచ స్థాయి కంపెనీలు ముందుకొచ్చాయి. ఈ లోపు కాంగ్రెస్ అధికారంలోకి రావడం, మధ్యమానేరు డెడ్ స్టోరీజీకి చేరుకోవడం చూస్తే ఆక్వాహబ్‌పై నీలినీడలు అలుముకున్నాయి. మత్స్య పరిశ్రమ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ప్రాజెక్టులు నింపే విషయంపై దృష్టి పెట్టాలన్న డిమాండ్ వస్తున్నది.

ఇయ్యాల 50 మందికి కూడా పనిలేదు

కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత సిరిసిల్ల బ్రిడ్జి దాకా నీళ్లుంటుండే. పదేండ్లలో కరువెట్ల ఉంటదో తెలువదు. నీళ్లులేక ఎండిన వాగును గిప్పుడే సూత్తున్నం. పోయిన ఎండకాలంలో రకరకాల చేపలు పట్టుకుని అమ్మినం. బొమ్మెలు, రవ్వులు, పాపర్లు, బంగారు చేపలు, రొయ్యలు ఇలా మోయలేనంత బరువున్న చేపలు దొరికేటియి. ఇంకా మే నెల రానేలేదు. డ్యాంలో నీళ్లులేక చేపలన్నీ సచ్చిపోతున్నయ్. ఒక్క రవ్వులు తప్ప ఇంకేమీ దొరుకుతలేవు. సొసైటీలో ఉన్న రెండు వేల మంది చేపలు పట్టుకుని బతికినోళ్లం. ఇయ్యాల 50 మందికి కూడా చేతినిండా పనిలేదు.

-గడప రమేశ్, ప్రధాన కార్యదర్శి, సిరిసిల్ల మత్స్యపారిశ్రామిక సొసైటీ

మా.. దండి కట్టం అచ్చింది

ఈ గోదారి తల్లి దయతోటి ఎల్లంపల్లి ప్రాజెక్టుల ఆడుతూ.. పాడుతూ పని చేసుకుంట చేపలు పట్టుకొని బతికేటోళ్లం. కానీ, ఇప్పుడు మాదండి కట్టం అచ్చింది. రోజూ సాయంత్రం 3 గంటలకు వలలు ఏస్తం. రోజూ పొద్దున 5 గంటలకు ప్రాజెక్టుకు పోయి వలలు తీసి చేపలు జోకిచ్చి 10 గంటలకు ఇంటికి అస్తం. రోజుకు వెయ్యి కిపైనే దొరికేది. పని జేసినట్టు అనిపియ్యక పోయేది. ఇగో.. ఇప్పుడు రొయ్యలు పడేటైం. రొయ్యలు శిఖారైతే ఇగ పంట పండినట్టే. పైసలే.. పైసలు. అట్లాంటి రోజులు మల్ల అత్తయా అనిపిత్తుంది.

-ధర్మాజి సాయికుమార్, మత్స్యకారుడు, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, రామగుండం మండలం

బీఆర్ఎస్‌తోనే బీజేపీకి చెక్!

మొదటిపేజీ తరువాయి...

సర్వేలో తేలటంతో లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ పార్టీకే అండగా నిలవాలని మైనార్టీ పెద్దలు సంకేతాలు ఇచ్చినట్టు చెప్తున్నారు.

ఐదు నెలల్లో హస్తం బలహీనం

అలవికాని హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఐదు నెలల్లోనే బలహీనపడినట్టు మైనార్టీ ప్రముఖులు చేసిన జాతీయ సర్వేలో తేలిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం, వ్యవసాయ సంక్షోభం, కరెంటు కోతలు తదితర సమస్యలతో ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. మరోవైపు దేశవ్యాప్తంగా రాహుల్ ప్రభ కనిపించకపోవటంతో ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోయినట్టు సర్వే తేల్చింది. 12-13 లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్-బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నదని, మిగిలిన 3-4 స్థానాల్లో బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య పోటీ ఉన్నట్టు సర్వేలో గుర్తించారు. ఈ నేపథ్యంలో మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్‌కు మద్దతిస్తే అది పరోక్షంగా బీజేపీకి వరంగా మారే ప్రమాదం ఉన్నదని మైనార్టీ పెద్దలు గ్రహించినట్టు తెలిసింది. అందుకే బీఆర్ఎస్‌కు మద్దతిచ్చి, ఆ పార్టీని గెలిపిస్తే.. బీజేపీని దెబ్బతీసినట్టు అవుతుందని వారు భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని క్షేత్రస్థాయికి సంకేతాలు పంపినట్టు తెలిసింది.

మరోసారి ఆ ట్రాప్‌లో పడొద్దు

బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసింది. ఆ ప్రచారాన్ని కొందరు నిజమేనని నమ్మినట్టు సర్వేలో ప్రస్తావించారు. ఈ పరిణామం తమకు అనుకూలమని భావించిన బీజేపీ కూడా.. ఆ ప్రచారాన్ని పెద్దగా తిప్పి కొట్టకుండా ఎన్నికల్లో లాభపడింది. తద్వారా ఏకంగా ఎనిమిది స్థానాలు (13.9 శాతం ఓట్లు) గెలుచుకుంది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రచారాన్ని నమ్మితే మరోసారి బీజేపీ నెత్తిన పాలుపోసినవారం అవుతామని సర్వేలో తేలినట్టు సమాచారం. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మోదీ ప్రభుత్వం ఈడీతో అరెస్టు చేయించింది. ఒకవేళ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు నిజమే అయితే ఎందుకు అరెస్టు చేస్తారు? అని ఇందులో విశ్లేషించినట్టు తెలిసింది. మైనార్టీ పెద్దలు తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులను విశ్లేషించినట్టు సమాచారం. ఈ విశ్లేషణలో బీజేపీకి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోతున్నదని గుర్తించారు. బీహార్‌లో తేజస్వీ యాదవ్, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్, కేరళలో విజయన్, ఢిల్లీలో ఆప్, ఒడిశాలో పట్నాయక్, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ.. ఇలా ప్రాంతీయ పార్టీలే బీజేపీని నిలువరిస్తున్నట్టు తేల్చారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల కంటే దాదాపు 10-12 శాతం ఓట్లు బీజేపీకి కోల్పోనున్నదని, బీఆర్ఎస్ మాత్రం తన ఓటింగ్ శాతాన్ని నిలుపుకోనున్నదని తెలంగాణలోని లోక్‌సభ స్థానాల్లో నిర్వహించిన ఒక సర్వే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ క్రమంలో సింహభాగం కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి మళ్లితే.. గెలవని కాంగ్రెస్‌కు మైనార్టీలు ఓటేస్తే.. బీజేపీకి పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరే ముప్పు పొంచి ఉన్నదని విశ్లేషణలో తేల్చారు. ఈ లెక్కన బీఆర్ఎస్‌కు ఏకపక్షంగా మద్దతివ్వాలని మైనార్టీ పెద్దలు నిర్ణయించినట్టు సమాచారం.

మైనార్టీలకు కేసీఆర్ చాలా మేలుచేసిండు

ముస్లిం మైనార్టీ ప్రజల ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకొని కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిండు. మైనార్టీ విద్యార్థుల కోసం మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, షాదీముబారక్, మైనార్టీ రుణాలు, మదర్సాలో పని చేసే మౌజమ్‌లు, ఇమాంలకు జీతాలు వంటి అనేక పథకాలు తీసుకొచ్చిండు. మైనార్టీ ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ఎవ్వరూ చేయలేదు. అన్ని వర్గాల అభ్యున్నతి బీఆర్ఎస్‌తోనే సాధ్యం. మైనార్టీలంతా లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుంటం.

– ఇమ్రాన్‌ఖాన్, మైనార్టీ యువ నాయకుడు, అక్బర్‌బాగ్, మలక్‌పేట

రేవంత్ సర్కారుపై టీచర్ల వి'ముఖ'త!

మొదటిపేజీ తరువాయి...

విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి.'విద్యాశాఖపై నాకు పూర్తి అవగాహన ఉన్నది. మా బంధువుల్లో టీచర్లున్నారు. ఎంతమంది బడికెళ్తున్నారో.. ఎంత మంది వెళ్లడం లేదో నాకు తెలుసు.' – ఇటీవల తనను కలిసిన ఉపాధ్యాయ సంఘం నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ సన్నాహాలు చేస్తుండగా, ఈ విధానాన్ని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 'నమ్మి ఓట్లేస్తే ఇంత మోసం చేస్తారా.. మా పైనే నిఘా పెడుతారా..?' అంటూ ప్రశ్నిస్తున్నాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని హెచ్చరిస్తున్నాయి. గతంలో కొన్ని జిల్లాల్లో విద్యాశాఖ జియో అటెండెన్స్ అమలు చేసింది. నిజామాబాద్ జిల్లా అంతటా పైలట్ పద్ధతిలో అమలైంది. తర్వాత హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాల్లో విస్తరించగా అప్పట్లో దీనిపై పెద్ద దుమారమే చెలరేగింది. ఉపాధ్యాయ సంఘాలన్నీ దీన్ని వ్యతిరేకించాయి. తాజాగా ఎఫ్ఆర్ఎస్‌ను కూడా కొన్ని సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 'పెండింగ్ డీఏలు చెల్లించకుండా, ఈ-కుబేర్‌లోని పెండింగ్ బిల్లులు క్లియర్ చేయకుండా ఇలా మాపై పెత్తనం ఏమిటి?' అని నల్గొండ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయ సంఘం నేత విస్మయం వ్యక్తంచేశారు. 'స్కూల్ టీచర్లను బడి దొంగలుగా చూడటం తగదు.. కొందరిని సాకుగా చూపి అందర్నీ బద్నాం చేయడం సరికాదు' అని మరో ఉపాధ్యాయ సంఘం నేత హితవు పలికారు. 'యాప్‌లో అటెండెన్స్ నమోదు కాకుంటే జీతం, అలవెన్సులు కట్ అయ్యి సస్పెండయ్యే అవకాశాలుంటాయి. ఇది మమ్మల్ని మానసిక ఆందోళనకు గురిచేసే ప్రమాదముంది' అని మరో ఉపాధ్యాయ సంఘం నేత ఆందోళన వ్యక్తంచేశారు. 'సాంకేతిక సమస్యలు, సిగ్నల్ లోపముంటే ఎలా అమలుచేస్తారు?' మరో సంఘం నేత ప్రశ్నించారు. 'విద్యారంగానికి నిధులు కేటాయించకుండా, బడుల్లో వసతులు కల్పించకుండా ఇలా చేయడం వల్ల ప్రయోజనముండదు' అని అభిప్రాయపడ్డారు.

అంధులకు మినహాయింపునివ్వండి: బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ఎఫ్ఆర్ఎస్ నుంచి తమకు మినహాయింపునివ్వాలని ప్రభుత్వాన్ని బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఇటీవలే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం ఇచ్చారు.

3 చోట్ల రేవంత్‌కు ముచ్చెమటలు!

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి ఉన్నట్టు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై రేవంత్‌రెడ్డికి రోజురోజుకు నమ్మకం సన్నగిల్లడానికి మరో కారణం బీఆర్ఎస్‌కు లభిస్తున్న అనూహ్య స్పందన. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖాముఖి తలపడ్డ బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మధ్య స్వల్ప ఓట్ల తేడా మాత్రమే నమోదైంది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ కనిపిస్తున్నది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు అనూహ్య స్పందన వస్తుండటంతో అధికార కాంగ్రెస్‌కు ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డికి ముచ్చెమటలు పడుతున్నాయి. త్రిముఖ పోటీలో మెజార్టీ ఎంపీ సీట్లు గెలుస్తామన్న ధీమా కాంగ్రెస్‌లో లేకుండా పోయింది. దీనికితోడు రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కారణమైన ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా వైఫల్యం చెందడం, దీనినే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రధాన అస్త్రంగా మలుచుకోవడంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. 'బీఆర్ఎస్ హయాంలోనే అంతా బాగుండేది' అన్న అభిప్రాయం ప్రజల్లో రోజురోజుకీ బలపడుతున్నది. నిజంగా ఇది రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడని పరిణామమే.

ఎవరికి వారే యమునా తీరే

పార్టీలో పలువురు సీనియర్లు సీఎం పదవి ఆశించేవారే తప్ప, ఎంపీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, పార్టీ అభ్యర్థుల గెలుపు బాధ్యతను భుజస్కంధాలపై వేసుకునే వారే లేకుండా పోయారని రేవంత్‌రెడ్డి తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన భార్యకు ఎంపీ టికెట్ రాలేదన్న అసంతృప్తితో ఖమ్మం నియోజకవర్గానికే పరిమితమై మొక్కుబడిగా ప్రచారం చేస్తున్నారని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. సమయం చిక్కినప్పుడు ఆయన కేరళ, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారే తప్ప రాష్ట్రంలో మిగతా ఎంపీ స్థానాల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శ ఉన్నది. మరో సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ నియోజకవర్గం దాటి బయటకు రావడం లేదు. మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ, భువనగిరి నియోజకవర్గానికే పరిమితమయ్యారు. తమ సొంత రాజకీయ పలుకుబడి కోసం కోమటిరెడ్డి బ్రదర్స్ భువనగిరి సీటు గెలిపించుకునేందుకు తంటాలు పడుతున్నారు. మిగతా మంత్రులదీ అదే పరిస్థితి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కూడా తన సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని రెండు ఎంపీ సీట్లతోపాటు తన సిట్టింగ్ స్థానం మల్కాజిగిరిని నిలబెట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలకు వెళ్లి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను కలియతిరిగి వస్తున్నారు. 'మీ జిల్లా బిడ్డకు సీఎం అయ్యే అవకాశం తొలిసారి వచ్చింది. దానిని కాపాడుకోవడం మీ అందరి బాధ్యత' అంటూ సెంటిమెంట్ గాలం వేస్తున్నారు. తనను సీఎం సీట్లోంచి దించేస్తారట అంటూ సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో రెండు ఎంపీ సీట్లు గెలిపిస్తే మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తానని జిల్లాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ బీసీ సామాజికవర్గానికి గాలం వేసే ప్రయత్నం చేస్తున్నారు. తనకు అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డికి మహబూబ్‌నగర్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించి అన్ని శక్తులు ధారపోస్తున్నారు.

కాంగ్రెస్, సీపీఎం నాయకులను నిలబిస్తున్న ఉపాధి హామీ కూలీలు

6 గ్యారెంటీల అమలేది?

మొదటిపేజీ తరువాయి...

దీటుగానే సమాధానమిచ్చారు. ఓట్ల కోసం వచ్చి మాయమాటలతో తమను మోసం చేశారని, హామీలు ఎక్కడ అని అడిగితే ఇప్పుడు బెదిరింపులకు దిగుతావా? అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే ఎన్నికలు అయిపోయిన రోజు నుంచి కాలనీలో కనీసం డ్రైనేజీలను కూడా శుభ్రం చేయడం లేదని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్ల కోసం వచ్చారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తామని స్పష్టం చేశారు. ఏం చేయాలో తోచని మంత్రి మహిళలకు ఎటువంటి సమాధానం ఇవ్వకుండానే వెళ్లిపోయారు.

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండల కేంద్రంలో సైతం ఇదేవిధంగా కాంగ్రెస్, సీపీఎం నేతలకు చుక్కెదురైంది. ఆరు గ్యారెంటీలను ఎక్కడ అమలు చేస్తున్నారంటూ ఉపాధి హామీ కూలీలు వారిని నిలదీశారు. ఉండవెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నేత వెంకట్‌గౌడ్, సీపీఎం నేత మద్దిలేటి తదితరులు ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు ప్రచారానికి వెళ్లారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆరు గ్యారెంటీలతోపాటు ఉపాధి కూలి రూ.400 చెల్లిస్తామని చెప్పడంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైనా సరిగ్గా అమలవుతున్నదా? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల నిలబడేందుకు కూడా స్థలం ఉండటం లేదని మండిపడ్డారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇప్పటివరకు అమలు కావడం లేదని, తాము బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎక్కడికి పోయాయని నిలదీశారు. తనకు 60 ఏండ్లు దాటినా సంక్షేమ పథకాలకు అర్హురాలిని కావడం లేదంటూ ఓ వృద్ధురాలు వాపోయారు. దీంతో కాంగ్రెస్, సీపీఎం నాయకులు సమాధానం చెప్పలేక అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆఫ్రికన్లలా దక్షిణాది వాసులు!

మొదటిపేజీ తరువాయి...

సోదరసోదరీమణులమే. భాషలు, మతాలు, సంప్రదాయాలు, ఆహార అలవాట్లను పరస్పరం గౌరవించుకుంటాం' అని ఆయన అన్నారు.

వ్యాఖ్యలు దురదృష్టకరం: కాంగ్రెస్

పిట్రోడా వ్యాఖ్యలు రాజకీయంగా పెనుదుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. జాతివివక్షను సహించబోయేది లేదన్నారు. శరీర రంగు చూపించి అవమానిస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. పిట్రోడా వ్యాఖ్యలపై కాంగ్రెస్ కూడా స్పందించింది. ఆయన వ్యాఖ్యలు దురదృష్టకరమన్న పార్టీ.. వాటిని ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమని చెప్పింది. పిట్రోడా వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు.

మోదీ కరిష్మా భ్రమే!

మొదటిపేజీ తరువాయి...

సమస్యలపైనే యావత్తు జాతి మాట్లాడుకొంటున్నది.

- గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, యూపీ వంటి హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో గరిష్ఠంగా ఎన్ని సీట్లు గెలుచుకోవాలో బీజేపీ 2019లోనే గెలిచింది.
- ఇప్పుడు ఆ రాష్ట్రాల్లో కొత్తగా గెలుచుకొనే సీట్లు లేదు. రైతుల ఆందోళన కారణంగా రాజస్థాన్, హర్యానా సరిహద్దు ప్రాంతాల్లో బీజేపీపై తీవ్ర వ్యతిరేకత పెరిగిపోయింది. హర్యానాలో బీజేపీ నేతలను అసలు ఊర్లలోనికే రానివ్వట్లే. అంటే ఆ రాష్ట్రాల్లో సీట్లు తగ్గొచ్చు.
- ఒడిశా నుంచి కేరళ వరకూ దక్షిణాది తీరప్రాంత రాష్ట్రాల్లో బీజేపీకి వచ్చే సీట్లేమీ లేవు.
- బెంగాల్, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలే వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయి. ఈ రాష్ట్రాల్లో విపక్షాలు బలంగా ఉండటమే దీనికి కారణం. ఇక్కడ ప్రతిపక్షాలు మెజారిటీ సీట్లు సాధిస్తే.. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయగలమన్న బీజేపీ ఆశలు నెరవేరకపోవచ్చు.

రూ.7.20 కోట్ల విలువైన మత్తు పదార్థాలు సీజ్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): నాలుగు నెలల కాలంలో రూ.7.20 కోట్ల విలువైన మత్తు పదార్థాలను సీజ్ చేశామని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 553 మందిపై కేసులు నమోదయ్యాయని చెప్పారు. 2,283.764 కేజీల డ్రై గంజాయి, 68.865 కేజీల గంజాయి చాక్లెట్లను పట్టుకొన్నామని వివరించారు.

ఆరు గ్యారెంటీల్లో కాంగ్రెస్ అమలు చేసినవి, చేయనవి


1 గ్యారెంటీ మహాలక్ష్మి
మహిళలకు ప్రతి నెల రూ.2500
అమలు కాలేదు
అమలు రూ.500 లకే గ